క్లుప్తంగా

ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలి


కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: విజయదశమి పండుగ ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు నింపాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆకాంక్షించారు. క్రోధినామ సంవత్సరం దసరా పండుగను ప్రజలంతా ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఈ ఏడాది రబీ సీజన్ అన్ని విధాలా కలిసొచ్చి పైర్లు బాగా పండి రైతులు మంచి దిగుబడులు సాధించాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి ఒక్కరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక తనిఖీ గ్రామ సభలు


అంబాపురంలో నిర్వహించిన గ్రామ సభ

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం, తవిసికొండ, ముద్దవరం, గోరుమానుకొండ గ్రామాల్లో 18వ విడత సామాజిక తనిఖీ గ్రామ సభలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు, డీఆర్‌పీలు తనిఖీ నివేదికలను వినిపించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అబ్జర్వర్లు దస్తగిరి బాబు, ఎంఈఓ సోమశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ రాజశేఖర్‌రెడ్డి, ఏపీఓ శేషన్న పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు


గాయపడిన రహంతుల్లా

డోన్ టౌన్: పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న ఈద్గా సమీపంలో శుక్రవారం ట్రాక్టరు ఢీకొని స్కూటరిస్టు గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని ఎద్దుపెంట గ్రామానికి చెందిన రహంతుల్లా బైక్‌పై డోన్ వస్తుండగా ఈద్గా సమీపంలో ట్రాక్టర్ ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రున్ని స్థానికులు డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. బంధువులు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న యువకులు

బేతంచెర్ల: ప్రమాద సమయంలో బాధితులకు మనం చేసే రక్తదానం ప్రాణదానంతో సమానమని బుగ్గానిపల్లె తండా ఉప సర్పంచ్ వెంకటేష్ నాయక్, ప్రభుత్వ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పోల్యా నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా గ్రామంలో గ్రామస్తులు స్వచ్ఛందంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువకులు, పెద్దలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు లక్ష్మన్ నాయక్, పరమేష్, నరేష్ నాయక్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 150 దరఖాస్తులు

కోవెలకుంట్ల: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాల్లో నూతన మద్యం విధానంలో కేటాయించిన మద్యం దుకాణాలకు శుక్రవారం చివరి రోజు గడువు ముగిసే సమయానికి 150 దరఖాస్తులు అందినట్లు ఆ శాఖ సీఐ తఖీబాషా తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలోని ఆయా మండలాల్లో 11 దుకాణాలకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో కోవెలకుంట్ల మండలంలోని ఐదు షాపులకు 77 దరఖాస్తులు, సంజామల మండలంలో నాలుగు షాపులకు 38, దొర్నిపాడు మండలంలో ఒక దుకాణానికి 17, ఉయ్యాలవాడలో ఒక షాపుకు 18 చొప్పున దరఖాస్తులు అందాయని వెల్లడించారు. ఈ నెల 14వ తేదీ నంద్యాల కలెక్టర్ కార్యాలయ ఆవరణలో లక్కీడిప్ ద్వారా మద్యం దుకాణాలు కేటాయిస్తామని తెలిపారు. ఆయనతో పాటు ఎస్‌ఐలు సందీప్‌యాదవ్, ప్రవీణ్ కుమార్ నాయక్ ఉన్నారు.

ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ఎక్సైజ్‌శాఖ పరిధిలోని 12 మద్యం దుకాణాలకు 168 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్‌శాఖ సీఐ వర్ధనదేవి తెలిపారు. బనగానపల్లె మండలంలో ఏడు షాపులకు 103, అవుకు రెండు మద్యం షాపులకు 27, కొలిమిగుండ్ల మండలంలో మూడు దుకాణాలకు 38 మంది దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. ఈ నెల 14న లక్కీ డిప్ ద్వారా దుకాణాల కేటాయింపు ఉంటుందన్నారు.

డోన్ రూరల్: డోన్ నియోజకవర్గంలో మొత్తం 16 మద్యం షాపులకు 355 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలు శనివారం వెల్లడిస్తామన్నారు.


నందవరంలో సిద్ధిదాత్రి అలంకారంలో చౌడేశ్వరిదేవి


కోవెలకుంట్ల: అన్నపూర్ణాదేవిగా వాసవీమాత


కోవెలకుంట్ల: మహిషాసుర మర్దినిగా మారెమ్మ


కొలిమిగుండ్ల: మహిషాసుర మర్దినిగా రాజరాజేశ్వరి


బనగానపల్లె: విజయలక్ష్మీగా వాసవీమాత


బేతంచెర్లలో వాసవీమాత


బేతంచెర్ల: మహిషాసురమర్దినిగా దుర్గమ్మ


మద్దిలేటిస్వామి ఆలయంలో మహిషాసురమర్దిని

సిద్ధిధాత్రి.. నమోనమామి

బనగానపల్లె రూరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా ఘనంగా జరుగుతున్నాయి. బనగానపల్లె మండలం నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి 9వ రోజు శుక్రవారం సిద్ధిదాత్రి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అలాగే కొండపేటలోని వాసవీకన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు విజయలక్ష్మీదేవిగా, అయ్యప్పస్వామి ఆలయంలోని గాయత్రీదేవి మహిషాసురమర్దినిదేవి అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు.

- కోవెలకుంట్ల: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని కోవెలకుంట్లలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు శుక్రవారం అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంకాలమ్మ చౌరస్తాలో వెలసిన ఆలయంలో మారెమ్మ, సరస్వతీ నగర్‌లో ప్రసన్న భారతీమాత మహిషాసురమర్దినిదేవిగా పూజలందుకున్నారు.
- కొలిమిగుండ్ల: మండలంలోని అంకిరెడ్డిపల్లె గీతాశ్రమంలోని రాజరాజేశ్వరిదేవి మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. బాలికలకు కాళ్లు కడిగి పసుపు పూసి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.
- ప్యాపిలి: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు వాసవీమాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ప్యాపిలి: మహిషాసురమర్దినిగా కన్యకాపరమేశ్వరి


వేలంలో అమ్మవారి మాలను దక్కించుకున్న రామచంద్రయ్య


బేతంచెర్ల: చండీ హోమంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

మహిషాసురమర్దినిగా మహాలక్ష్మి

బేతంచెర్ల: మండలంలోని మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ రామాంజనేయులు అర్చకుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి సహస్రదీపాలంకరణ సేవ, సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం రథంపై కొలువుంచి మంగళవాయిద్యాలు, భక్తులు గోవింద నామస్మరణ నడుమ ఆలయ వీధుల్లో ఊరేగించారు.

- బేతంచెర్ల అమ్మవారిశాలలో చండీ హోమం నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు. వాసవీ మాత సంతాన లక్ష్మిగా భక్తులను అనుగ్రహించారు. అమ్మవారి పూలమాలను వేలం వేయగా మట్టా రామచంద్రయ్య రూ.25 వేలకు దక్కించుకున్నారు. అలాగే గౌరిపేటలోని వేంకటేశ్వర స్వామి చంద్రప్రభ వాహనంపై భక్తులకు కనువిందు చేశారు.
- అవుకు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకారణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం హోమాలు చేశారు.
- సంజామల: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో దుర్గమ్మ అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ముక్కులు చెల్లించుకున్నారు.



డోన్ టౌన్: స్థానిక పాతపేట అమ్మవారిశాలలోని వాసవీ కన్యాకాపరమేశ్వరి, పాతబస్టాండ్‌లోని కనకదుర్గాదేవీ, కొత్తపేటలోని విజయ కనకదుర్గాదేవీలను మహిషాసురమర్దినిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

డోన్: మహిషాసురమర్దినిగా కనకదుర్గాదేవీ


బేతంచెర్ల: చంద్రప్రభ వాహనంపై వేంకటేశ్వరస్వామి

చిగురమానుపేటలో కార్డన్ సెర్చ్


ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ


అనుమానితులను ప్రశ్నిస్తున్న పోలీసులు

డోన్ టౌన్: నేర రహిత జిల్లాగా తీర్చిద్దిడమే లక్ష్యంగా నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా చర్యలు తీసుకుంటున్నారని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం డోన్ పట్టణంలోని చిగురమానుపేటలో సీఐలు ఇంతియాజ్‌బాషా, రాకేష్, ఎస్‌ఐలు, సిబ్బంది, క్యూఆర్టీ బృందాలుగా ఏర్పడి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు ఇళ్లలో సోదా చేసి అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఎలాంటి ధ్రువ పత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాలు, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్డన్ సెర్చ్ ప్రక్రియ నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

తపాలా పథకాలపై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

డోన్ టౌన్: తపాలా పథకాలతో ఆర్థిక భరోసా లభిస్తుందని సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళీశ్వరరెడ్డి తెలిపారు. జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉడుములపాడు గ్రామంలో తపాల శాఖలో అందుబాటులో ఉన్న పొదుపు ఖాతా, సుకన్య సమృద్ధి యోజన, గ్రామీణ తపాలా బీమా, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ తదితర సేవలపై అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో ఎదురయ్యే ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ పోస్టాఫీసులో అందుబాటులో ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ మద్దిలేటి, సిబ్బంది పాల్గొన్నారు.

14న జాతీయ అప్రెంటిషిప్ మేళా

డోన్ టౌన్: ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు కర్నూలు, నంద్యాల జిల్లాలోని వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నట్లు పెర్కొన్నారు. ఐటీఐ పాసైన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరై వివిధ కంపెనీల్లో అప్రెంటిషిప్ చేసే అవకాశం పొందాలని సూచించారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ ఎస్‌ఎస్‌సీ, ఐటీఐ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బయోడేటాతో హాజరుకావాలన్నారు. ఐటీఐ పాసై ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి అప్రెంటిషిప్ రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడి మృతి


వెంకట కృష్ణయ్య (ఫైల్)

అవుకు: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు వెంకట కృష్ణయ్య(55) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన సంజామల మండలం ఆకుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. దసరా సెలవులు కావడంతో ఇంటి దగ్గరే ఉన్న ఆయన హఠాత్తుగా గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందారు. భార్య జయలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని హ్యాంగ్ అవుట్ హోటల్ వద్ద శుక్రవారం రాత్రి బైక్‌ను బొలెరో వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని వైఎస్ నగర్‌కు చెందిన నవీన్, శివ స్కూటీపై వెళుతుండగా బొలెరో వాహనం ఢీకొన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. నవీన్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఇద్దరిని కర్నూలుకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అమ్మవారి సేవలో బుగ్గన అర్జున్‌రెడ్డి

డోన్ టౌన్/బేతంచెర్ల: దేవీ నవరాత్రుల సందర్భంగా డోన్ పట్టణంలో జరుగుతున్న ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి పాల్గొన్నారు. పాతపేటలోని కన్యకాపరమేశ్వరి, పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారికి పూజలు చేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చర్మన్ హరికిషన్, శ్రీరాములు, కౌన్సిలర్లు ఉన్నారు. అలాగే బేతంచెర్ల అమ్మవారిశాలలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా ఆయుధ పూజ


నందివర్గం పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ చేస్తున్న పోలీసులు


డోన్‌లో ఆర్టీసీ బస్సులకు పూజలు


ట్రాన్స్‌ఫార్మర్లకు పూజలు చేస్తున్న సిబ్బంది

బనగానపల్లె: దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమిని పురస్కరించుకుని శుక్రవారం ఆయుధ పూజను భక్తిశ్రద్ధలతో జరపుకున్నారు. వాహనాలు, దుకాణాలు, కార్యాలయాలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి ఆయుధ పూజ చేశారు. బనగానపల్లెలోని నందివర్గం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో బనగానపల్లె సీఐ మంజునాథ్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బనగానపల్లె ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో సీఐ వర్ధనదేవి, ఎస్‌ఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు.

డోన్ టౌన్: స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు ఆర్టీసీ డిపో, విద్యుత్, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాల్లో ఆయుధ పూజ నిర్వహించారు. ఆయుధాలు, వస్తువులను శుభ్రం చేసి వాటిని దుర్గాదేవీ ఫొటోలతో అలంకరించి పూజలు చేశారు.

బేతంచెర్ల: పట్టణంలోని పలు పరిశ్రమల్లో ఆయుధ పూజను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సీఐ డి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ రమేష్ బాబు, స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏడీ మధుసూదన్‌రెడ్డి, ఏఈలు శ్రీనివాసులు, పుల్లయ్య ఆధ్వర్యంలో ఆయుధ పూజ జరిగింది. కాగా శనివారం దసరా పండుగను పురస్కరించుకుని నిత్యావసర సరుకులు, వస్త్రాలు కొనుగోలు కోసం వచ్చిన వారితో బేతంచెర్ల కిక్కిరిసింది.


బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ

కంపచెట్లు ఇలా.. ప్రయాణం ఎలా


గొర్విమానుపల్లె సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు


పెట్నికోటలో రోడ్డుపైకి వచ్చిన కంపచెట్లు

కొలిమిగుండ్ల: పెట్నికోట నుంచి గొర్విమానుపల్లె మీదుగా తుమ్మలపెంట వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏపుగా పెరిగి రోడ్డుపైకి కొమ్మలు రావడంతో రాకపోకలు సాగించే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో రెండు వాహనాలు ఎదురుపడితే పక్కకు వెళ్లే మార్గం లేకుండా పోతుంది. మలుపుల వద్ద అకస్మాత్తుగా రెండు వాహనాలు ఎదురుపడిన సందర్భంలో కంపచెట్లలోకి వాహనాలు వెళుతున్నాయి. రాత్రి వేళల్లో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతోందని వాహనదారులు వాపోతున్నారు. పెట్నికోటతో పాటు అవుకు మండలంలోని కొండమీద గ్రామాలైన ఉప్పలపాడు, కొండమనాయినపల్లె, జూనుంతల తదితర గ్రామాల నుంచి ప్రజలు గొర్విమానుపల్లె, తుమ్మలపెంట మీదుగా తాడిపత్రికి రాకపోకలు సాగిస్తుంటారు. ఈమార్గంలో ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాలు రోజు పదుల సంఖ్యలో వెళ్తుంటాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ


బావిలో చేపలను వదులుతున్న వైద్య సిబ్బంది

సంజామల: నీటి కుంటలు, బావుల్లో గంబూషియా చేప పిల్లను వదలడం ద్వారా దోమలను నివారించవచ్చని ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ యమున, మలేరియా సబ్ యూనిట్ రత్నాచారి తెలిపారు. శుక్రవారం అవుకు గ్రామంలోని వంకదారి బావి ఆదర్శ పాఠశాల సమీపంలో నీరు నిల్వ ఉన్న కుంటలు, బావుల్లో గంబూషియా చేప పిల్లలను వదిలారు. నీటిలో దోమల లార్వాలు వృద్ధి చెందకుండా చేపలను వదిలినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ చేపలు దోమల లార్వాలను తినేసి దోమలు వృద్ధి చెందకుండా చూస్తాయన్నారు.